క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా 11 కేవీ యాదవనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

కందుకూరు: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కందుకూరు చౌరస్తాలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.30.80 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. చౌరస్తాలోని నివాసాల సముదాయం నుంచి వచ్చే మురుగు ముందుకు వెళ్లేందుకు వీలు లేక రైస్ మిల్ ఎదుట నిలువ ఉంటుందన్నారు. ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సహకారంతో జెడ్పీ నిధుల నుంచి రూ.20లక్షలు, 15వ ఫైనాన్స్ నిధుల నుంచి మరో రూ.10.80లక్షలు కేటాయింయారని చెప్పారు. దెబ్బడగూడలో యూజీడీ నిర్మాణానికి రూ.6.74లక్షలు మంజూరైయ్యాయన్నారు.

త్రివేణినగర్ ఫేజ్-1 నూతన కార్యవర్గం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ త్రివేణినగర్ కాలనీ ఫేజ్-1 నూతన కార్యవర్గానికి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. 2వ సారి కాలనీ అధ్యక్షుడిగా గాదం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నివ్వగా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా మల్లేష్, ఓంప్రకాశ్, రవి, మోహన్, రాంచందర్, కార్యదర్శులుగా సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీరాములు, బోస్‌బాబు, వెంకటేష్‌గుప్తా, సలహాదారులుగా రాజేందర్, నగేశ్, దత్తు, నగేష్‌గౌడ్ ఎన్నికయ్యారు.

కృష్ణయ్యకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కృష్ణయ్య

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జోగు కృష్ణయ్యకు డాక్టరేట్ వచ్చింది. సామాజిక కవిత్వం-ఉత్తమ బోధనలో విశేష కృషి చేసినందుకు గాను ఢిల్లీ వెబ్బిక్ ఇంటర్ నేషనల్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను అందజేసింది. హైదరాబాద్ నగరంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, వర్సిటీ ప్రొఫెసర్లు కృష్ణయ్యకు డాక్టరేట్‌ను అందజేశారు.

కార్యకర్తల అభీష్టం మేరకు నడుచుకుంటా

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు తాను నడుచుకుంటానని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని కేశవరెడ్డి గార్డెన్‌లో రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీలో ఉండి ఆరేళ్లుగా ఎటువంటి అభివృద్ధి చేయని నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి సాధించేది ఏముందని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మాజీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు రాములుతదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నిత్యారెడ్డి తదితరులు

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేయాలని మంచాల జెడ్పీటీసీ నిత్యరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్, చిత్తాపూర్, కొర్రవాణి తండా, లోయపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు సహకారంతో మంచాల మండలంలో కోట్లాది రూపాయాల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆగాపల్లిలో రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, కొర్రవాణి తండాలో రూ.3.10లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు, కాగజ్ ఘట్ గ్రామంలో రూ.2.65లక్షలతో కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, చిత్తాపూర్‌లో రూ.3లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణం, లోయపల్లిలో రూ.2.25లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు ఈ-కేవైసీ

ఇప్పటికే 75 శాతం పూర్తి

- పేరున్న వారంతా వేలిముద్రలివ్వాల్సిందే
- లేదంటే రేషన్ కట్

బోగస్ రేషన్ కార్డుల ఏరివేత.. రేషన్ సరుకుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కార్డులో ఉన్నవారంతా కేవైసీ పూర్తి చేయించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ కోసం వేలిముద్రలు పెడుతున్న కార్డుదారులు

మహేశ్వరం: రేషన్ కార్డులకు ఈ-కేవైసీ అనుసంధానంపై లబ్ధిదారుల్లో ఎన్నో సందేహాలున్నాయి. ఈ కేవైసీ తప్పనిసరి చేయడమే కాకుండా వెంటనే చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. పౌరసరఫరాల శాఖ ఆదేశానుసారం కార్డులోని ప్రతీ సభ్యుడు రేషన్ దుకాణానికి వెళ్లి వేలి ముద్రలు వేయాలంటే కష్టమేనని అంటున్నారు. మండల పరిధిలో 47 రేషన్ దుకాణాలుండగా 17,796 కార్డులున్నాయి. అందులో ఆహారభద్రత కార్డులు 15,128, అంత్యోదయ కార్డులు 2,657, అన్నపూర్ణ కార్డులు 11 ఉన్నాయి. ఒక్కొక్క రేషన్ డీలరు వద్ద కనిష్టంగా మూడు వందలు, గరిష్టంగా ఎనిమిది వందల వరకు కార్డులున్నాయి. వీరందరి వేలి ముద్రలు ఈ-పాస్ యంత్రంపై సేకరించాల్సి ఉంది.

ఆకుపచ్చ లైట్ వస్తే పునరుద్ధరణ పూర్తి

రేషన్ కార్డు కలిగిన కుటుంబ యాజమానితో పాటు కార్డులో పేర్లున్న వారంతా సమీప రేషన్ దుకాణానికి వెళ్లాలి. రేషన్ డీలర్ ఈ పాస్ యంత్రంలో రేషన్‌కార్డు నెంబర్ ఎంటర్ చేస్తారు. అందులో కుటుంబ సభ్యులందరి పేరు ఆధార్ కార్డు నెంబర్‌తో చూపిస్తుంది. వాటిని సరిచూసిన తరువాత ఒక్కొక్కరి వేలిముద్ర తీసుకుంటారు. ఆకు పచ్చ లైట్ వెలిగితే సదరు సభ్యుల కేవైసీ పునరుద్ధరణ పూర్తయినట్లు . ఒక వేళ ఈ పాస్ యంత్రంలో ఎరుపు రంగు లైటు వెలిగితే వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిపోలేదంటూ రిజెక్టు సూచిస్తుంది. దీంతో ఒక యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగింపునకు గురవుతుంది. రేషన్ కార్డులో ఎన్ని పేర్లు ఉన్నాయో వారంతా రేషన్‌దుకాణానికి కేవైసీ కోసం ఒకసారి తప్పక రావాల్సి ఉంటుంది.

ఏరివేత సరే.. మరి కొత్తకార్డులు

అనర్హుల ఏరివేత.. అర్హుల వివరాలను అప్‌డేట్(నవీకరించడం) కోసం ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ చెబుతోంది. పలు చోట్ల పెళ్లిళ్లు చేసుకుని అత్తారింటికి వెళ్లిన వారి పేరిట, మృతి చెందిన వారి పేరిట ప్రతీ నెల బియ్యం వస్తున్నాయి. ప్రస్తుతం కార్డు కలిగిన కుటుంబంలో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వస్తే అందరికీ బియ్యం వస్తున్నాయి. ఈ-కేవైసీతో అలాంటి పేర్లు తొలగిస్తున్నారు. కాగా వీటితో పాటే అర్హులను చేర్చాలని కోరుతుండడంతో దీనిపై ప్రభుత్వం నిర్ణయం రాలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే 75 శాతం ఈ-కేవైసీ పూర్తయింది. మిగిలిన వారికి త్వరగా పూర్తి చేయాలని రేషన్ డీలర్లకు అధికారులు సూచిస్తున్నారు.

వృద్ధులు, పిల్లల అప్‌డేట్‌కు ఇబ్బందులు

రేషన్‌కార్డు లబ్ధిదారులు ఆధార్ కార్డులను పదేళ్లకొకసారి అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ విషయమై ఫోన్‌కు మేసేజ్‌లు వస్తున్నాయి. ఆధార్ అప్‌డేట్ చేసుకున్న వ్యక్తులు మాత్రం రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ పాస్ యంత్రంపై వేలి ముద్రలు వేయాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు పిల్లలు, వృద్ధులకు వేలి ముద్రలు సరిపోలడం లేదు. వీరికి ఐరిష్ ద్వారా చేయాలని చెబుతున్నా రేషన్ దుకాణాల్లో అందుకు సరిపడా వసతులు లేవు.

> **తప్పక చేయించాలి**
>
> రేషన్‌కార్డు ఉన్నవారు తప్పనిసరిగ్గా ఈ-కేవైసీ చేసుకోవాలి. కార్డులోని కుటుంబ సభ్యులంతా తమ సమీప రేషన్ దుకాణంలో ఈ పాస్ యంత్రంలో వేలి ముద్రలు వేయాలి. ఉపాధి, ఇతర పనుల కోసం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి నమోదు చేసుకోవచ్చు. రేషన్‌బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే ఇంట్లో ఎంత మంది సభ్యులంటే అందరూ ఈ కేవైసీ తప్పకుండా నమోదు చేసుకోవాల్సిందే.
>
> – మహమూద్ అలీ, తహసీల్దార్, మహేశ్వరం

పునరాలోచనలో కాంగ్రెస్

- మహేశ్వరంలో మళ్లీ అంతర్గత సర్వే
- 'దేపా' వైపు మెజార్టీ నేతలు మొగ్గు..?

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం టికెట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డికి టికెట్ దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పార్టీలోని సీనియర్లు అలర్టయ్యారు. మహేశ్వరం టికెట్ కేటాయింపు విషయంలో పెద్ద మొత్తంలో డబ్బులు, భూములు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా పదేళ్లుగా అధికారం లేకపోయినా.. అనేక కష్టనష్టాలకోర్చి కేడర్‌ను, పార్టీని కాపాడుకుంటూ వచ్చిన వారిని కాదని, బీఆర్‌ఎస్‌ను వీడి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన చిగిరింతకు టికెట్ ఇవ్వనున్నారనే విషయాన్ని.. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సహా నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేప భాస్కర్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలు వ్యతిరేకించారు. ఈ మేరకు ఇటీవల వారంతా ఢిల్లీ వెళ్లి అధిష్టానం పెద్దలను కలిసి ఇదే అంశంపై పట్టుపట్టారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పరవాలేదు కానీ.. ఇతరులకు ఇస్తే మాత్రం ఓడగొడతామని కూడా హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో పార్టీ అధిష్టానం టికెట్ కేటాయింపు విషయంలో పునరాలో చనలో పడినట్లు తెలుస్తోంది. ఆ మేరకు నియోజకవర్గంలోని ఆశావహులు, పనితీరుపై మళ్లీ సర్వే చేయించగా, మెజార్టీ కార్యకర్తలు దేప పేరును సూచించినట్లు తెలిసింది. పార్టీ అంతర్గత సర్వేలతో పాటు సీనియర్ నేతలు కూడా ఆయన పేరునే ప్రస్తావించినట్లు సమాచారం. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లు సహా మహేశ్వరం మండలంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఎప్పటికప్పుడు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూనే.. ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు. ఇదే స్థానం నుంచి పోటీకి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నర్శింహారెడ్డి కూడా పోటీ పడుతున్నట్లు తెలిసింది.

పాదయాత్రను విజయవంతం చేయండి

ఆమనగల్లు: శీతాకాల పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర అలంపూర్ నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో చంద్రకిరణ్ మాదిగ, మల్లేశ్, మైసయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్‌పూలే, శ్రీకాంత్, వడ్డె రాజు, విజయ్‌చందర్, మహేందర్, గెలువయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సక్సెస్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఆయుష్‌చక్ర సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు ప్రారంభించారు.

శిబిరంలో డాక్టర్ సునీత దాదాపు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా అర్జున్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, జంగయ్య, కేశయ్య, మైసయ్య, వెంకటయ్య, రమేశ్, పోచయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థులకు సన్మానం

కడ్తాల్: టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ఫలితాల్లో మండలంలోని మైసిగండి గ్రామానికి చెందిన సర్దార్‌నాయక్, కల్యాణ్‌నాయక్, ప్రవీణ్‌నాయక్ పోలీస్ ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో యువకులను ఘనంగా సన్మానించారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలపల్లికి చెందిన వెంకటేష్‌గౌడ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సోమవారం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేష్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూత్ ఫర్ సేవా వలంటీర్లు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి, కందుకూరు బాలురు, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) టెస్ట్ మెటీరియల్‌ను యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో మొగిళ్ల శ్రీకాంత్, కందడి శ్రీరామ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ కింద ఉత్తీర్ణులైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. తాము అందించే మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని స్కాలర్‌షిప్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వలంటీర్లు ఢిల్లీ అనిల్, సాయికిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల అరెస్ట్

ఆమనగల్లు: ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. అయితే ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా కార్యకర్తలను అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

కొనసాగుతున్న సమ్మె

ఆమనగల్లు పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సీఐటీయు జిల్లా నాయకులు కురుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటయ్య మద్దతు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కార్పొరేటర్ నిరసన దీక్ష



దీక్ష చేస్తున్న కాలనీవాసులు, కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా తదితరులు

చైతన్యపురి: సర్వీసు రోడ్లు ఆక్రమించుకున్న చిరువ్యాపారుల వల్ల కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరిసింహగుప్తా కాలనీవాసులతో కలిసి సోమవారం నిరసన దీక్ష చేశారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట చౌరస్తా వరకు పండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, రహదారులు ఆక్రమించుకోవటంతో సాయినగర్, ప్రభాత్‌నగర్, సత్యనారాయణ పురంకాలనీలలోకి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఉదయం 6 గంటల నుంచి కాలనీవాసులు దీక్ష చేస్తున్నా కనీసం జీహెచ్ఎంసీ అధికారులు స్పందించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో చిరువ్యాపారులు, కాలనీవాసుల మధ్య వాగ్వాదం జరగటంతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంతో కాలంగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఎప్పుడూ లేనిది ఇప్పుడు మావల్ల ఇబ్బంది ఎందుకు వస్తుందని కాలనీవాసులను ప్రశ్నించారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జున ఇరువర్గాలకు నచ్చచెప్పి చిరువ్యాపారులను అక్కడ నుంచి పంపించి వేశారు.

- జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి కాలనీల ప్రజల సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, డీఈ నీలిమా హామీ ఇవ్వటంతో దీక్ష విరమింపజేశారు. దీక్షలో రాజగోపాల్, రామారావు, వెంకటరమణ,రాజిరెడ్డి, సిద్దేశ్వర్, వేణుగోపాలచారి. శివ వోజా నాయకులు శంకర్, వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గ



మాట్లాడుతున్న మేయర్ దుర్గ

మీర్‌పేట: పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందామని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అన్నారు. సోమవారం మేయర్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆయా డివిజన్లలో చేపట్టాల్సిన పనులపై కార్పొరేటర్లతో చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది కార్పొరేటర్లను సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, డీఈ గోపినాథ్, ఏఈ శ్రీనివాస్, ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్ఓ అంజన్‌రెడ్డి, టీపీఓ దేవానంద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

మహేశ్వరం డీఎం మోహన్‌రెడ్డి



డీఎంను సన్మానిస్తున్న తెలంగాణ హ్యూమన్‌రైట్స్ మెంబర్స్

కందుకూరు: విద్యార్థులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని మహేశ్వరం డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రం నుంచి సంతోష్‌నగర్ మధ్య నూతన బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు కందుకూరు మండల కేంద్రం నుంచి ప్రతీ రోజు ఉదయం 7.40 మరియు 8.05 నిమిషాలకు సంతోష్‌నగర్ వరకు రెండు సర్వీసులు నడుపుతున్నామన్నారు. దీంతో విద్యార్థులు, వ్యాపారులకు ఇబ్బందుల తప్పనున్నాయన్నారు. కాగా డిపో మేనేజర్‌ను తెలంగాణ హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ నిజాముద్దీన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగుప్తా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూటీ మెంబర్లు కిషోర్, ప్రమీల, డిపో సిబ్బంది ఖాజా, పాషా, నారాయణ, వ్యాపారులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ముస్లింల అభ్యున్నతి



మాట్లాడుతున్న కార్తీక్ రెడ్డి

పార్టీ నేత కార్తీక్‌రెడ్డి

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్‌తోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహిన్‌నగర్‌లో ఆదివారం రాత్రి వివిధ పార్టీల కార్యకర్తల బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్తీక్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముస్లింలను నేటికీ ఓటు బ్యాంక్‌గానే చూస్తోందన్నారు. తుక్కుగూడలో ముస్లింలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తే.. బీజేపీ రేసులో ఉన్న నాయకుడు ధర్నాలు చేయడం ముస్లింలు గుర్తుంచుకోవాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లిం బస్తీలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి సబితా రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, ఎక్బాల్ బిన్ ఖలీఫా, అలీ పటేల్, షేక్ అఫ్జల్, సయ్యద్ హుస్సేన్, పర్వేజ్ పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాలకు మహర్దశ



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో ప్రాచీన దేవాలయాలకు మహర్దశ సంతరించుకుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయానికి రూ. కోటి నిధులతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పురాతన దేవాలయాలకు రెండు విడతలుగా మంజూరైన రూ.8 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యాదాద్రి టెంపుల్ ను పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, శ్రీధర్, అరవింద్ శర్మ, నగేష్, మహమ్మద్, శ్యామ్ గుప్తా, వెంకటేష్ గుప్త, లిక్కి ఊర్మిళ రెడ్డి, పటేల్ సునీత రెడ్డి, సుజాత రెడ్డి, మాధవి, అనురాధ, స్వప్న, పుష్పాలత, దుబ్బక శేఖర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కందుకూరు: ఆత్మీయ సమ్మేళనం పేరిట పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలుసుకున్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1993-94లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఓ ఫంక్షన్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు జగన్మోహనాచారి, వెంకటేశం, సుదర్శన్, పెంటారెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్, దుర్గలత, దర్శన్‌ను సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సామాజిక సేవలో భాగంగా కస్తూర్బాగాంధీ పాఠశాలలోని విద్యార్థినులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.మంజుల, టి.అనురాధ, బి.దయాకర్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, ఎస్.వెంకటరంగారెడ్డి, ఎస్.రవీందర్‌రెడ్డి, ఎ.దయాకర్‌రెడ్డి, ఇ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కందుకూరు జెడ్పీహెచ్ఎస్ 1993-94 బ్యాచ్ విద్యార్థులు